పర్యావరణ మార్పులతో ఆయుష్షు క్షీణత

న్యూఢిల్లీ, జనవరి 19: పర్యావరణ మార్పుల కారణంగా మనిషి సగటు ఆయుర్దాయం అర్ధ సంవత్సరం(ఆరు నెలలు) పడిపోయే అవకాశం ఉన్నదని తాజా అధ్యయనం వెల్లడించింది. 1940 నుంచి 2020 మధ్య 191 దేశాలకు చెందిన సగటు ఉష్ణోగ్రతలు, వర్షపాతం, ఆయుర్దాయం వంటి వాటిని పరిశోధకులు అధ్యయనంలో భాగంగా పరిగణనలోకి తీసుకొన్నారు. ప్రపంచ ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెల్సియస్ పెరిగితే.. మనిషి సగటు ఆయుష్షు దాదాపు 0.44 సంవత్సరాలు లేదా ఆరు నెలల ఒక వారం హరిస్తున్నదని ఫలితాల్లో వెల్లడైంది.

ఎస్ఎస్బీ చీఫ్‌గా దల్జీత్ సింగ్ చౌదరి

న్యూఢిల్లీ: సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్బీ) చీఫ్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి దల్జీత్ సింగ్ చౌదరిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆయన 1990 బ్యాచ్‌కు చెందిన ఉత్తర ప్రదేశ్ కేడర్ అధికారి. ప్రస్తుతం ఆయన సీఆర్‌పీఎఫ్ స్పెషల్ డైరెక్టర్ జనరల్‌గా పని చేస్తున్నారు. పదవీ విరమణ తేదీ 2025 నవంబరు 30 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగవచ్చు. భూటాన్, నేపాల్, భారత్ సరిహద్దుల్లో రక్షణ బాధ్యతలను ఎస్ఎస్బీ నిర్వహిస్తుంది.

గాజాలో అల్-ఇస్రా వర్సిటీ పేల్చివేత

గాజా సిటీ : గాజాలోని ప్రముఖ అల్-ఇస్రా యూనివర్సిటీపై ఇజ్రాయెల్ బాంబుదాడి చేసింది. దీంతో యూనివర్సిటీ ప్రధాన భవనం నామరూపాలు లేకుండా పోయింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో అమెరికా స్పందించింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ఇజ్రాయెల్‌ను కోరింది. ఈ దాడిపై యూనివర్సిటీ అధికారులు స్పందిస్తూ తొలుత వర్సిటీలోని విలువైన వస్తువులను ఇజ్రాయెల్ సైనికులు దోచుకున్నారని తెలిపారు. అనంతరం బాంబులతో భవనాన్ని పేల్చివేశారని చెప్పారు. ఇప్పటికే గాజాలోని కీలకమైన వైద్య, విద్యా సంస్థలను ధ్వంసం చేసిన ఇజ్రాయెల్ ఇప్పుడు అల్-ఇస్రాను కూడా నేలమట్టం చేసిందని ధ్వజమెత్తారు.

బీఎస్ఎన్ఎల్‌ను బతికించండి!

5జీ నడుస్తుంటే 4జీ కూడా తీసుకురారా?

- మిగతా కంపెనీలతో పోటీపడేదెలా?
- కేంద్ర మంత్రికి సంస్థ ఉద్యోగుల వినతి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు టెలికం సంస్థలు హైస్పీడ్ 5జీ సేవలిస్తుంటే, బీఎస్ఎన్ఎల్ కనీసం 4జీ సేవలు కూడా ఇవ్వక పోవడంతో పోటీని తట్టుకోలేక పోతున్నదని, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం కేంద్ర ప్రభుత్వానికి గోడు వెళ్లబోసుకుంది. రోజు రోజుకూ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఇతర కంపెనీల సేవలకు వెళ్లిపోతున్నారని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే బీఎస్ఎన్ఎల్ మూతపడిపోతుందని యూనియన్ నాయకులు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. ప్రైవేట్ టెలికం కంపెనీలు ఒకవైపు 5జీ హై-స్పీడ్ డేటా సేవలందింస్తుంటే, బీఎస్ఎన్ఎల్ కనీసం 4జీ సేవలు కూడా అందించటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ద్వారా 4జీ పరికరాలు అందిస్తామని ప్రభుత్వం చెప్పినా, దాని అమలులో ఎంతో జాప్యం జరుగుతున్నదన్నారు. బీఎస్ఎన్ఎల్ ద్వారా రాబోయే రెండు వారాల్లో 4జీ సేవలు, డిసెంబర్ నాటికి 5జీ సేవలందిస్తామని గతేడాది మే నెలలో మంత్రి చేసిన ప్రకటనను కూడా యూనియన్ తన లేఖలో ఉటంకించింది. ఇంతవరకు 4జీ సేవలపై టీసీఎస్ క్షేత్ర స్థాయిలో ట్రయల్స్ కూడా పూర్తి చేయలేదని, అలాంటి పరిస్థితుల్లో బీఎస్ఎన్ఎల్ ద్వారా 4జీ, 5జీ సేవలు అందించడానికి మరెంత కాలం పడుతుందో చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయని యూనియన్ పేర్కొంది.

ప్రతి నెలా లక్షల్లో వలస వెళ్తున్న కస్టమర్లు

టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) గణాంకాల ప్రకారం 2023 ఆగస్టులో బీఎస్ఎన్ నుండి ఇతర నెట్‌వర్క్‌లకు వలస వెళ్ళిన కస్టమర్ల సంఖ్య 22,20,654 మంది కాగా, సెప్టెంబర్‌లో ఆ సంఖ్య 23,26,751 కి పెరిగింది. 2022 నుంచి దాదాపు 77 లక్షల మంది బీఎస్ఎన్ఎల్ కస్టమర్లు ఇతర నెట్‌వర్క్‌లకు వెళ్లిపోయారు. బీఎస్ఎన్ఎల్ సీఎండీ టీసీఎస్ ద్వారా 4జీ నెట్‌వర్క్ పరికరాల ఏర్పాటు పనులు అక్టోబర్ 2024లోగా పూర్తవుతాయని చెప్తున్నారని, ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి వైష్ణవ్ వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని బీఎస్ఎన్ఎల్ తన కస్టమర్లకు 4జీ, 5జీ సేవలు అందించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని, లేని పరిస్థితుల్లో బీఎస్ఎన్ఎల్ మూసివేసే పరిస్థితులు ఏర్పడతాయని యూనియన్ కోరింది.ఇప్పటికే ఉన్న 4జీ అనుకూల పరికరాలను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం నిరాకరించడం, ప్రపంచ విక్రేతల నుంచి 4జీ పరికరాల కొనుగోలులో ప్రైవేటు టెలికం కంపెనీలతో సమానంగా లేకపోవడం బీఎస్ఎన్ఎల్ దుస్థితికి కారణమని యూనియన్ తెలిపింది.

4 వేల కోట్ల ప్యాలెస్, 700 కార్లు, 8 జెట్స్

- యూఏఈ రాయల్ ఫ్యామిలీ చాలా రిచ్ గురూ..!

న్యూఢిల్లీ: రూ.4,078 కోట్ల ప్యాలెస్.. 700 కార్లు.. 8 ప్రైవేట్ విమానాలు.. ఇలా కండ్లు చెదిరే ఆస్తులతో యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జయద్ అల్ నహ్యాన్ రాజ కుటుంబం ప్రపంచంలోనే అత్యంత ధనిక కుటుంబంగా పేరు పొందింది. జీక్యూ కథనం ప్రకారం ఈ రాజ కుటుంబంలో 18 మంది అన్నదమ్ములు, 11 మంది అక్కచెల్లెళ్లు ఉన్నారు. వీరికి తొమ్మిది మంది పిల్లలు, 18 మంది మనవళ్లు ఉన్నారు. ప్రపంచంలోని చమురు నిల్వల్లో ఈ కుటుంబానికి 6 శాతం వాటా ఉంది. మాంచెస్టర్ సిటీ ఫుట్‌బాల్ క్లబ్ యజమాని అయిన ఈ కుటుంబానికి ప్రముఖ బ్యూటీ కంపెనీ ఫెంటీ మొదలుకొని స్పేస్ ఎక్స్ వరకు వివిధ కంపెనీల్లో షేర్లున్నాయి. అబుధాబిలో ఈ కుటుంబం నివసించే అధ్యక్షుడి ప్యాలెస్ 94 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ ప్యాలెస్‌లో ఖరీదైన కళాత్మక వస్తువులు, 350,000 క్రిస్టల్స్ పొదిగిన చాండ్లియర్ ఉన్నాయి. ఈ కుటుంబానికి లండన్, ప్యారిస్‌తో పాటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఖరీదైన ఆస్తులున్నాయి. 2015లో న్యూయార్కర్ మ్యాగజైన్ కథనం ప్రకారం బ్రిటిష్ రాజ కుటుంబంతో పోల్చదగిన ఆస్తులు ఈ దుబాయ్ రాజ కుటుంబానికి ఉన్నాయి.

సముద్రగర్భ డ్రోన్‌ను పరీక్షించిన ఉత్తరకొరియా

సియోల్, జనవరి 19: అణ్వస్త్ర సామర్థ్యమున్న సముద్రగర్భ డ్రోన్‌ను ఉత్తరకొరియా విజయవంతంగా పరీక్షించింది. దక్షిణ కొరియా, అమెరికా, జపాన్ సంయుక్తంగా నిర్వహించిన నౌకదళ కసరత్తులకు ప్రతిస్పందనగా శుక్రవారం ఈ డ్రోన్‌ను పరీక్షించినట్టు ఉత్తర కొరియా ప్రకటించింది. కొరియన్ ద్వీపకల్ప ప్రాంతంలో ఉద్రిక్తతలకు అమెరికా దాని ఆసియా మిత్ర దేశాలే కారణమని ఆరోపించింది. తాము పరీక్షించిన డ్రోన్ నౌకలను, నౌకాశ్రయాలను ధ్వంసం చేస్తుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించారు. దక్షిణ కొరియాతో శాంతియుతంగా తిరిగి ఐక్యమవ్వాలన్న తమ దీర్ఘ కాల లక్ష్యాన్ని చెరిపేసి ఆ దేశాన్ని ప్రధాన శత్రు దేశంగా నిర్వచిస్తూ తమ రాజ్యాంగాన్ని తిరిగి రాసుకుంటామని ఆయన అన్నారు.

రెండేండ్లైనా జాడ లేదు!

- అటకెక్కిన గిరిజన పారిశ్రామికవేత్తల రుణ పథకం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): గిరిజన పారిశ్రామిక వేత్తలను ఆదుకుంటామంటూ రెండేండ్ల కింద ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన రాయితీతో కూడిన వెంచర్ క్యాపిటల్ ఫండ్ (వీసీఎఫ్-ఎస్టీ) పథకం అమలుకు నోచుకోలేదు. ఈ పథకం కోసం 2022-23 బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించినా తర్వాత రూ.20 కోట్లకు సవరించారు. 2023-24 బడ్జెట్‌లో రూ.30 కోట్లు కేటాయించినా ఆ పథకం కాగితాలకే పరిమితమైంది. కొవిడ్ మహమ్మారితో నష్టపోయిన గిరిజన పారిశ్రామిక వేత్తలను ఈ పథకం ద్వారా ఆదుకుంటామని బీజేపీ ప్రభుత్వం ప్రచారం చేసుకున్నది. రాయితీ కూడిన వడ్డీ రేటుతో కనీసం రూ.50 లక్షల నుండి రూ.1 కోటి వరకు ఈ పథకం కింద గిరిజనుల స్టార్టప్‌లకు, పరిశ్రమలకు ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పి అమలును మరిచిపోయింది. ఎన్నికల సమయంలో ఈశాన్య రాష్ట్రాల్లో ఓట్లు దండుకోవడానికే ఈ పథకం తెచ్చి ఇప్పుడు అమలు చేయడం లేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా

ఆర్థిక సహాయం అవసరం

కరోనా సంక్షోభంతో అతలాకుతలమైన పారిశ్రామిక రంగం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నది. ఆర్థిక వనరులు లేక గిరిజన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం కనీసం ఇప్పటికైనా వీసీఎఫ్-ఎస్టీ పథకం కింద నిధులు విడుదల చేసి వారిని ఆదుకోవాలి.

– మిలింద్ కాంబ్లే, వ్యవస్థాపక అధ్యక్షుడు, దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ.

అన్ని భాషల్లో డిజిటల్ స్టడీ మెటీరియల్

- మూడేండ్లలో సిద్ధం చేయాలి
- బడులు, ఉన్నత విద్యాసంస్థలకు కేంద్రప్రభుత్వం ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 19: వచ్చే మూడేండ్లలో పాఠశాల, ఉన్నత విద్య స్థాయిలో బోధించే వివిధ కోర్సులకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను అన్ని భారతీయ భాషలలో విద్యార్థులకు డిజిటల్ రూపంలో అందించాలని పాఠశాలలు, ఉన్నత విద్యా సంస్థలను కేంద్రం ఆదేశించింది.చాలా ప్రాంతాల్లోని విద్యార్థులు మొదటి నుంచి మాతృభాషలోనే విద్యాభ్యాసం చేయడం, తర్వాత ఉన్నత చదువులకు తమ మాతృభాషలో స్టడీ మెటీరియల్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దేశంలోని విద్యార్థులకు తమ మాతృభాషలోనే విద్యను అభ్యసించే అవకాశం కల్పించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. జాతీయ విద్యా విధానం సిఫార్సుల మేరకు విద్యలోని ప్రతి స్థాయిలో బహుభాషా వాదాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించింది. స్టడీ మెటీరియల్‌ను భారతీయ భాషలలో డిజిటల్ రూపంలో తేవాలని యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీఈఆర్‌టీ, ఎన్ఐఓఎస్, ఇగ్నో వంటి సంస్థలతో పాటు ఐఐటీ, ఐఎన్ఐ, సీయూ, ఎన్ఐటీ సంస్థల అధిపతులను కేంద్రం ఆదేశించింది.

బట్టలు ఊడదీసి.. తలకిందులుగా వేలాడదీసి!

- అనాథ పిల్లలపై ఆశ్రమ సిబ్బంది క్రూరమైన అకృత్యాలు
- చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుల ముందు వాపోయిన పిల్లలు
- మధ్యప్రదేశ్‌లో ఇండోర్‌లోని ఓ అనాథాశ్రమంలో ఘటన

ఇండోర్: వారంతా ఏ దిక్కూ లేని పిల్లలు. మధ్యప్రదేశ్‌లో ఇండోర్‌లోని ఓ అనాథాశ్రమంలో ఉంటున్నారు. అలాంటి వారిని తల్లిదండ్రులు లేని లోటు కనిపించకుండా చూసుకోవాల్సిన ఆశ్రమ సిబ్బందే రాక్షసంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. చిన్న తప్పులకే చిత్రహింసలు పెడుతూ దారుణంగా వ్యవహరిస్తున్నారని బాధిత చిన్నారులు వాపోతున్నారు. బట్టలు ఊడదీయడం, నగ్నంగా ఫొటోలు తీయడం, తలకిందులుగా వేలాడదీయడం, వాతలు పెట్టడం, మిర్చిని కాల్చడం ద్వారా వచ్చే పొగను బలవంతంగా పీల్చేలా చేయడం వంటివి చేస్తూ క్రూరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆశ్రమ సిబ్బంది పలు విధాలుగా హింస పెడుతున్నారని గత వారం ఆకస్మిక తనిఖీలకు వచ్చిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) ముందు 21 మంది చిన్నారులు వాపోయారని పోలీసులు తాజాగా వెల్లడించారు. ఈ భయానక హింసకు సంబంధించి ఐదుగురు ఆశ్రమ సిబ్బందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ప్యాంటులో మలవిసర్జన చేశాడన్న కారణంతో ఒక నాలుగేండ్ల విద్యార్థిని బాత్ రూమ్‌లో నిర్బంధించి, 2-3 రోజుల పాటు ఆహారం కూడా పెట్టలేదని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆశ్రమాన్ని సీల్ చేశామని, పిల్లలను ప్రభుత్వ కేంద్రాలకు తరలించామని ఇండోర్ ఏసీపీ అమరేంద్ర సింగ్ తెలిపారు. వాత్సల్యపురం జైన్ ట్రస్టు నిర్వహిస్తున్న ఈ ఆశ్రమం జువైనల్ జస్టిస్ యాక్ట్ కింద నమోదు కాలేదని, ఈ ట్రస్టుకు బెంగళూరు, సూరత్, జోధ్‌పూర్, కోల్‌కతాలో కూడా ఆశ్రమాలు ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు. ఇండోర్ ఆశ్రమంలో మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన చిన్నారులు ఉన్నట్టు తెలుస్తున్నది.

ఎస్వీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకున్నా

సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్నారు సీనియర్ నటుడు నరేష్. సినిమాలతో పాటు ఓటీటీ వేదికపై కూడా సత్తా చాటుతున్నారు. ఈ ఏడాదితో ఆయన సినీ రంగంలో యాభై ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. నేడు నరేష్ జన్మదినం. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు..

నేను సినీ వాతావరణంలో పుట్టి పెరిగాను. అదే నా జీవితం కావాలని బలంగా కోరుకున్నా. తొమ్మిదేళ్ల ప్రాయంలో 'పండంటి కాపురం' చిత్రంతో బాలనటుడిగా అరంగేట్రం చేశాను. ఆ తర్వాత 'నాలుగు స్తంభాలాట' చిత్రం ద్వారా హీరోగా మంచి పేరొచ్చింది. నా ఫస్ట్ ఇన్నింగ్స్‌లో అమ్మ విజయనిర్మల, విశ్వనాథ్, బాపు, జంధ్యాల, ఈవీవీ సత్యనారాయణ, వంశీ, రేలంగి నరసింహా రావు వంటి దిగ్గజాలతో కలిసి పనిచేసే అదృష్టం దక్కింది. వాళ్లే నా కెరీర్‌కు పునాది వేశారు. సుదీర్ఘ కెరీర్‌లో ప్రతి సినిమాలో ఏదో ఒక కొత్తదనం కోసం ప్రయత్నించాను. విజయాలు లభించినప్పటికీ మనసుకు నచ్చిన సినిమాలు చేయలేకపోతున్నాననే చిన్న నిరాశతో తొలి ఇన్నింగ్స్ ముగిసిపోయింది. దాదాపు పదేళ్ల పాటు పరిశ్రమకు దూరమైనా.. ఎస్వీ రంగారావుగారిని స్ఫూర్తిగా తీసుకొని సెకండ్ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టాను. మీ శ్రేయోభిలాషి, గుంటూరు టాకీస్, అ ఆ, దృశ్యం వంటి చిత్రాలతో నా సెకండ్ ఇన్నింగ్స్ ఊపందుకుంది.

రెమ్యునరేషన్ గురించి ఆలోచించను

గత ఏడాది 'సామజవరగమన' చిత్రం కొత్త ఊత్సాహాన్నిచ్చింది. లీడ్ రోల్‌లో నటించిన 'మళ్లీ పెళ్లి' చిత్రంతో పాటు ఓటీటీలో చేసిన ఇంటింటి రామాయణం, మాయా బజార్ చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. నటుడిగా నేను కోరుకున్న దానికి మించి గొప్ప పాత్రలు లభిస్తున్నాయి. ఒకప్పుడు సేవాభావంతో రాజకీయాల్లోకి వెళ్లాను. ఇప్పుడు రాజకీయాలపై ఆసక్తి లేదు. కథ నచ్చితే నేను రెమ్యునరేషన్ గురించి ఏమాత్రం ఆలోచించను. ప్రస్తుత ట్రెండ్‌లో విభిన్న తరహా పాత్రలు లభిస్తున్నాయి. కథ నచ్చితే నెగెటివ్ రోల్స్‌లో నటించానికి సిద్ధమే. మా విజయకృష్ణ బ్యానర్‌లో త్వరలో ఓ సినిమా అనౌన్స్ చేస్తాం. నటుడిగా ఉన్నంతకాలం పరిశ్రమకు సేవ చేస్తూనే ఉంటాను.

చిత్రం

అప్పుడు కన్నీళ్లు ఆగలేదు

ఇటీవల విడుదలైన 'యానిమల్' చిత్రంలో సంప్రదాయ గృహిణి గీతాంజలి పాత్రలో చక్కటి అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించింది కన్నడ సోయగం రష్మిక మందన్న. హీరో రణబీర్‌కపూర్‌తో పోటాపోటీగా ఆమె నటన సాగిందని ప్రశంసలొచ్చాయి. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమా షూటింగ్ తాలూకు అనుభవాలను పంచుకుంది రష్మిక మందన్న. సినిమాల విషయంలో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా విజన్ చూసి షాకయ్యానని, రణబీర్‌కపూర్‌ను కొట్టే సన్నివేశం సవాలుగా అనిపించిందని చెప్పింది. ఆమె మాట్లాడుతూ 'ఒకే ఒక్క టేక్‌లో ఆ సీన్ పూర్తి చేశాం. ఆ సన్నివేశంలో భావోద్వేగాలు బలంగా పండాలని దర్శకుడు సందీప్ రెడ్డి చెప్పారు. చాలా సహజంగా సీన్ రావాలన్నారు. రణబీర్‌ను బాగా కొప్పడుతూ చెంపపై గట్టిగా కొట్టాను. షాట్ ఓకే అని చెప్పినా నా కన్నీళ్లు ఆగలేదు. అంతలా ఆ సీన్‌లో ఇన్‌వాల్వ్ అయ్యాను' అని చెప్పింది. 'పుష్ప-2' చిత్రం కూడా అద్భుతంగా రూపుదిద్దుకుంటున్నదని, తన పాత్ర మొదటిభాగం కంటే చాలా ఉన్నతంగా ఉంటుందని రష్మిక మందన్న పేర్కొంది.

రష్మిక మందన్న

విజయానికి కలెక్షన్లే సాక్ష్యం

మహేష్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన 'గుంటూరు కారం' చిత్రం సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. తొలివారంలో ఈ చిత్రం 212కోట్ల వసూళ్లను రాబట్టింది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చిత్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'విడుదలైన రోజు ఉదయం కొందరు సోషల్‌మీడియా ద్వారా మా సినిమాపై దుష్ప్రచారం చేసి ప్రేక్షకులను గందరగోళానికి గురిచేసే ప్రయత్నం చేశారు. కానీ ఫ్యామిలీ ఆడియెన్స్ రాకతో సాయంత్రానికి టాక్ మొత్తం మారిపోయింది. ఈ సినిమా విజయానికి తొలివారంలో సాధించిన వసూళ్లే సాక్ష్యం. ఇందులో తల్లీకొడుకుల సెంటిమెంట్ బాగా ఆకట్టుకుంటున్నది. అందుకే ఆ స్థాయి కలెక్షన్స్ వస్తున్నాయి' అన్నారు. కొందరు కావాలనే తమ సినిమాను టార్గెట్ చేశారని, నెగెటివ్ రివ్యూలు సినిమా విజయంపై ఏమాత్రం ప్రభావం చూపలేదని నాగవంశీ తెలిపారు. 'టైటిల్ చూసి ఇదొక పక్కా మాస్ సినిమా అనే భావన కొంతమందిలో కలిగింది. ఫ్యామిలీ సినిమా అనే విషయాన్ని ప్రేక్షకుల్లోకి బలంగా తీసుకెళ్లలేకపోయాం. అందుకే అభిమానులు ఏమైనా నిరాశచెందారేమో అనిపించింది. అయితే భారీ వసూళ్లతో మా అంచనాలు నిజమయ్యాయి. మహేష్‌బాబు కూడా మొదటి నుంచి ఈ సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నారు. నెగెటివ్ రివ్యూలు చూసి ఆయన ఏమాత్రం ఆందోళన చెందలేదు. రేపటి నుంచి ఈ సినిమా వసూళ్లు ఎలా ఉంటాయో చూడండి అంటూ మాకు భరోసానిచ్చారు. ఆయన ఇచ్చిన ధైర్యమే ఈ స్థాయి వసూళ్లు రావడానికి కారణమైంది' అని నాగవంశీ చెప్పారు.

యథార్థ సంఘటనల 'మట్కా'

వరుణ్‌తేజ్

హీరో వరుణ్ తేజ్ 'మట్కా' అనే సినిమాతో పాన్ ఇండియాలో అరంగేట్రం చేస్తున్నారు. 'పలాస 1978', 'శ్రీదేవి సోడా సెంటర్' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. శుక్రవారం వరుణ్ తేజ్‌కు పుట్టిన రోజు సందర్భంగా 'మట్కా' ఓపెనింగ్ బ్రాకెట్ వీడియోను విడుదల చేశారు. 1958-1982 మధ్య జరిగిన సంచలన యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిస్తున్న కథ ఇది. నోరా ఫతేహీ, మీనాక్షి చౌదరి హీరోయిన్స్. నవీన్ చంద్ర, కన్నడ కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి డీవోపీ: ఏ కిశోర్ కుమార్, సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, నిర్మాతలు: డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి, కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: కరుణ కుమార్.

మమ్మల్ని క్షమించండి

అగ్ర కథానాయిక నయనతార ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అన్నపూరణి'. నీలేష్ కృష్ణ దర్శకత్వం వహించారు. గత డిసెంబర్ 29న ఓటీటీలో స్ట్రీమింగ్ అయిన ఈ సినిమా ఇటీవల వివాదాస్పదమైంది. 'అన్నపూరణి' నయనతార 75వ సినిమా. 'ది గాడెస్ ఆఫ్ ఫుడ్' అనేది ఈ చిత్రానికి ఉప శీర్షిక. సంప్రదాయ కుటుంబంలో పుట్టిన అమ్మాయి చెఫ్‌గా ఎదగాలనే తన కలను ఎలా సాకారం చేసుకుంది? అనే కథాంశంతో ఈ సినిమాను రూపొందించారు. ఇటీవల నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కాగా, ఇందులో కొన్ని సన్నివేశాలు మత విశ్వాసాలను దెబ్బతీసేలా ఉన్నాయంటూ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఈ చిత్రాన్ని ఓటీటీ నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలపై నయనతార స్పందించారు. ''బరువెక్కిన హృదయంతో ఈ ప్రకటన చేస్తున్నా. మంచి ఆలోచనతో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'అన్నపూరణి' సినిమాను రూపొందించాం. సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిన ఈ సినిమాను ఓటీటీ వేదిక నుంచి తొలగిస్తారని ఊహించలేదు. సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలియజేసేందుకు ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ ప్రయత్నంలో మాకు తెలియకుండానే కొందరి హృదయాలు గాయపడ్డాయి. మా చిత్రబృందం సహా నేను ఎవరి మనోభావాలను దెబ్బ తీయాలని అనుకోలేదు. నేను ఉద్దేశపూర్వకంగా ఇలా చేయలేదు. మీ మనోభావాలను గాయపర్చినందుకు క్షమించండి. ఈ చిత్ర ప్రధాన ఉద్దేశం ఎవరినీ కించపర్చడం కాదు. నా 20 ఏళ్ల కెరీర్‌లో సానుకూలతను వ్యాప్తి చేయాలనే చూశాను' అని పేర్కొన్నారు.

సందేశాత్మక ప్రేమకథ

అర్జున్ కల్యాణ్, కుషిత జంటగా నటిస్తున్న చిత్రం 'బాబు'. లక్ష్మణ్ వర్మ దర్శకుడు. డీడీ క్రియేషన్స్ పతాకంపై దండు దిలీప్ కుమార్ రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలో తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'విలాసం కన్నా అవసరం గొప్పది అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుంది. కథలోని సందేశం ఆకట్టుకుంటుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. మురళీధర్ గౌడ్, భద్రం, జబర్దస్త్ అప్పారావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: పీఎస్ మణికర్ణన్, సంగీతం: పవన్, దర్శకత్వం: ఎంఎల్ఆర్ (లక్ష్మణ్‌వర్మ).

సింగిల్ క్యారెక్టర్ సింగిల్ షాట్

అగ్ర కథానాయిక హన్సిక ప్రధాన పాత్రలో వస్తున్న సినిమా '105 మినిట్స్'. రాజు దుస్సా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రుద్రాన్ష్ సెల్యులాయిడ్స్, మాంక్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బొమ్మక్ శివ నిర్మాత. గురువారం ట్రైలర్ రిలీజ్ అయింది. తన పాత్ర వేషధారణలోనే హన్సిక ట్రైలర్‌ను విడుదల చేయడం వినూత్నంగా తోచింది. హన్సిక మాట్లాడుతూ ''ఒకే క్యారెక్టర్‌ని ఒకే షాట్‌లో చిత్రీకరించిన తొలి ప్రయోగాత్మక చిత్రమిది. ఇలాంటి ప్రయోగాత్మక సినిమాలు ఎన్నో ఉన్నాయి. కానీ 34 నిమిషాల షాట్‌ను సింగిల్ టేక్‌లో చేయడం నాకు కొత్త అనుభవాన్ని, అనుభూతిని పంచింది. 8 రోజుల రిహార్సల్స్ చేసిన తర్వాత షూటింగ్‌కి వెళ్లాం' అని చెప్పింది. ప్రస్తుతానికి ఒక్క తెలుగు వెర్షన్‌లోనే మేకర్స్ చేయనున్నారు. తర్వాత వివిధ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేసే ఆలోచనతో ఉన్నారు. జనవరి 26న ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కిశోర్ బోయిదాపు, సంగీతం: సామ్ సీఎస్, నిర్మాత: బొమ్మక్ శివ, దర్శకత్వం: రాజు దుస్సా.

హన్సిక